ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తమిళనాడు

TAMILNADU

సోమవారం 22 జనవరి 2024



పార్టీ పతాక ఆవిష్కరణలో స్టాలిన్, మంత్రులు, ఎంపీ కనిమొళి తదితరులు



మహానాడు సావనీర్‌ను ఆవిష్కరించి తొలిప్రతిని డీఎంకే ప్రధాన కార్యదర్శి దురైమురుగన్‌కు అందిస్తున్న స్టాలిన్

గవర్నర్ వ్యవస్థను రద్దు చేయండి

- డీఎంకే యువజన విభాగ తీర్మానం
- అట్టహాసంగా మహానాడు

చెన్నై, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వాల పరిపాలనకు అడ్డుగా ఉంటున్న గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలని, కుల వ్యవస్థను ప్రోత్సహించే కేంద్రప్రభుత్వ నూతన విద్యావిధానాన్ని ఉపసంహరించుకోవాలని, కేంద్రప్రభుత్వ సంస్థల్లో స్థానికులైన తమిళులకు ఉద్యోగవకాశాలు కల్పించాలని కోరుతూ డీఎంకే యువజన విభాగం ద్వితీయ మహానాడు కీలకమైన తీర్మానాలు ఆమోదించింది. సేలం జిల్లా పెద్దనాయకన్ పాళయంలో ఆదివారం ఉదయం అట్టహాసంగా డీఎంకే యువజన విభాగం ద్వితీయ మహానాడు ప్రారంభమైంది. డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, డీఎంకే కోశాధికారి టీఆర్ బాలు, రాష్ట్ర మంత్రి కేఎన్ నెహ్రూ సమక్షంలో ఆ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎంపీ కనిమొళి మహానాడు ప్రాంగణంలోని పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ మహానాడులో యువజన విభాగం అధ్యక్షుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి... 25 తీర్మానాలను ప్రతిపాదించి ఆమోదించారు. విద్యను రాష్ట్ర జాబితాలో చేర్చాలని, విశ్వవిద్యాలయాల ఛాన్సలర్‌గా సీఎం వ్యవహరించాలని చేసిన కీలకమైన తీర్మానాలున్నాయి.

అధ్యక్షుడికి ధన్యవాదాలు...

యువజన మహానాడును నిర్వహించేందుకు అనుమతించిన పార్టీ అధ్యక్షుడు స్టాలిన్‌కు ధన్యవాదాలు తెలిపారు. మహిళలకు ఉచిత ప్రయాణం, గృహిణులకు నగదు, బడిపిల్లలకు అల్పాహారం, నాన్ ముదల్వన్, పుదుమై పెణ్, పొంగల్ నగదు, కానుకల పంపిణీ చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతూ వరుసగా ఎనిమిది తీర్మానాలను ఉదయనిధి ఆమోదింపజేశారు. మిచౌంగ్ తుఫాను బాధితులను, తూత్తుకుడి సహా నాలుగు జిల్లాల్లో వరద బాధితులను ఆదుకునేలా చర్యలు చేపట్టినందుకు, అంతర్జాతీయ పెట్టుబడిదారుల మహానాడును విజయవంతం చేసినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేశారు. అలాగే రాష్ట్రాన్ని క్రీడా రాజధానిగా మార్చేందుకు పాటుపడుతున్న క్రీడా శాఖ మంత్రి ఉదయనిధికి ధన్యవాదులు తెలుపుతూ, నీట్ రద్దు చేసేంతవరకూ ఉద్యమాన్ని కొనసాగించాలని తీర్మానాలు చేశారు.

గవర్నర్ పదవులు అనవసరం...

ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వాలకు అడ్డుగా ఉంటున్న గవర్నర్ వ్యవస్థను రద్దు చేయడమే మంచిదని 17వ తీర్మానంలో డీఎంకే యువజన విభాగం అభిప్రాయపడింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్ల ద్వారా పోటీ ప్రభుత్వం నడిపిస్తుండటం గర్హనీయమని పేర్కొంది. రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో తమిళులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ, రాష్ట్ర హక్కులను హరిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఖండిస్తూ దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ప్రతిపాదించిన స్వయం ప్రతిపత్తి పాలన దిశగా రాష్ట్రాలకు మరిన్ని హక్కులు కల్పించాలని కోరింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, సీబీఐ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెత్తనం చెలాయించడాన్ని, పార్లమెంట్‌లో ప్రతిపక్ష సభ్యులను అదే పనిగా సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తూ మరికొన్ని తీర్మానాలు ప్రతిపాదించారు. హిందువుల వ్యతిరేక పార్టీ బీజేపీ మాత్రమేనని ప్రజలలో అవగాహన కల్పిస్తామని పేర్కొంటూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించడమే ధ్యేయంగా యువజన విభాగం సభ్యులు లోక్‌సభ ఎన్నికల్లో సైనికులా పనిచేయాలని పిలుపునిచ్చింది. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపించి కేంద్రంలో బీజేపీయేతర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా పార్టీ శ్రేణులంతా ఎన్నికల ప్రచార కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించాలని కోరుతూ 25వ తీర్మానాన్ని ప్రతిపాదించారు.

నూతన విద్యవిధానం వద్దు...

నాణ్యమైన విద్యనందించడంలో జాతీయస్థాయిలో అత్యున్నతమైన స్థానంలో రాష్ట్రం ఉందని, అలాంటప్పుడు కేంద్రం ప్రతిపాదిస్తున్న నూతన విద్యావిధానాన్ని అమలు పరచాల్సిన అవసరంలేదని 14వ తీర్మానంలో పేర్కొన్నారు. ఈ నూతన విద్యావిధానం కులవ్యవస్థను ప్రోత్సహించే రీతిలో ఉందని కూడా ఆ తీర్మానంలో పేర్కొన్నారు.

రాష్ట్ర జాబితాలో విద్య...

ప్రస్తుతం ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను మళ్లీ రాష్ట్ర జాబితాలో చేర్చాలని 15వ తీర్మానంలో ప్రతిపాదించారు. నీట్ కారణంగా గ్రామీణ యువకులు ప్లస్-2 పరీక్షల్లో అత్యధిక మార్కులు సంపాదించినా వైద్య కోర్సుల్లో చేరలేకపోతున్నారని ఉదయనిధి పేర్కొన్నారు. అదేవిధంగా 16వ తీర్మానంలో విశ్వవిద్యాలయాలకు ఛాన్సలర్లుగా ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులే ఉండడం అన్ని విధాలా సమంజసంగా ఉంటుందని మహానాడు పేర్కొంది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ముఖ్యమంత్రి విశ్వవిద్యాలయాలకు ఛాన్సలర్‌గా ఉంటే విద్యారంగం మరింత అభివృద్ధి చెందగలదని, ఆ మేరకు ప్రభుత్వం చేసిన ముసాయిదా చట్ట సవరణను ఆమోదించాలని కోరింది.



మహానాడు తీర్మానాలను ప్రకటిస్తున్న డీఎంకే యువజన విభాగం నేత ఉదయనిధి

బీజేపీకి చరమగీతం పాడుదాం

డీఎంకే శ్రేణులకు ఉదయనిధి పిలుపు

చెన్నై, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు యువకులంతా నడుం బిగించాలని డీఎంకే యువజన విభాగం అధ్యక్షుడు, రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి పిలుపునిచ్చారు. సేలం జిల్లా పెద్దనాయకన్ పాళయంలో డీఎంకే యువజన విభాగం ద్వితీయ మహానాడులో ఆయన ప్రసంగిస్తూ... మునుపటి అన్నాడీఎంకే పాలకుల అండదండలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి చెందిన హక్కులన్నింటినీ హరించి వేసిందన్నారు. ఇటీవల ఎనిమిది జిల్లాల్లో తుఫాను, వరదలు సంభవించినప్పుడు కేంద్రం తక్షణమే నిధులు విడుదల చేయాలని తాను డిమాండ్ చేస్తే మాట తీరు బాగాలేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తనపై విరుచుకుపడ్డారన్నారు. వరదలు, తుఫాను సంభవించి నెలలు దాటినా కేంద్రం నుంచి నిధులు రాలేదన్నారు. తమిళ సంస్కృతిని, తమిళ భాషను నాశనం చేయాలనుకుంటున్న బీజేపీ పాలకుల ఎత్తుగడలు పారవన్నారు. రాబోయే ఎన్నికల్లో ఇండియా కూటమి ప్రకటించే అభ్యర్థే ప్రధాని పదవిలో ఉంటారని, ఆ దిశగా డీఎంకే యువజన విభాగ కార్యకర్తలంతా వెంటనే ఎన్నికల పనులను ప్రారంభించాలని పిలుపునిచ్చారు.

ఇండియా కూటమి గెలుపు తథ్యం

- వరద నిధులు విదిలించని మోదీ
- రాష్ట్రాలను ఏటీఎంలుగా మార్చేశారు
- తిరుక్కురళ్ వల్లిస్తే ఓట్లు రాలవు
- డీఎంకే యువజన మహానాడులో సీఎం స్టాలిన్



డీఎంకే యువజన ద్వితీయ మహానాడులో పాల్గొన్న ఆ పార్టీ అధ్యక్షుడు స్టాలిన్‌కు వెండి రాజదండాన్ని బహూకరిస్తున్న ఉదయనిధి తదితరులు

చెన్నై, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాల హక్కులను హరించి వేస్తున్న కేంద్రంలోని బీజేపీ పాలకులకు లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తప్పదని, ఇండియా కూటమి గెలుపు తథ్యమని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. సేలం జిల్లా పెద్దనాయకన్ పాళయంలో డీఎంకే యువజన ద్వితీయ మహానాడు సభలో ఆదివారం సాయంత్రం ఆయన ఉద్వేగంగా ప్రసంగించారు. రాష్ట్రానికి ఆర్థిక వనరులను తగ్గించి, అన్ని వసూళ్లను తామే చేపట్టి రాష్ట్రాలను ధనమిచ్చే ఏటీఎంలుగా బీజేపీ పాలకులు మార్చివేశారని ధ్వజమెత్తారు. తమిళనాట తిరుక్కురళ్ సూక్తులు వల్లిస్తే ఓట్లు రాలుతాయని అపోహ పడుతున్నారని, త్వరలో బీజేపీ ప్రభుత్వం పతనం కానున్నదన్నారు. యువజన మహానాడులో ముఖ్య అతిథిగా పాల్గొనడంతో తన వయస్సు 20 యేళ్లు తగ్గినట్లు అనిపిస్తోందన్నారు. 1980లో మదురై తాను యువజన విభాగాన్ని ప్రారంభించానని, ఆ విభాగమే ప్రస్తుతం పార్టీలో కీలక పాత్ర పోషించే స్థాయికి చేరుకుందని ప్రశంసించారు.

యువజన విభాగం నా పుట్టిల్లు...

ద్రావిడ ఉద్యమం ఆవిర్భవించి వందేళ్లు దాటిందని, డీఎంకే ఆవిర్భవించి 75 సంవత్సరాలు పూర్తయ్యిందని స్టాలిన్ అన్నారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా డీఎంకే చెక్కుచెదరలేదని, రెట్టింపు ఉత్సాహంతో లోక్‌సభ ఎన్నికల గెలుపు దిశగా పరుగులు తీస్తోందన్నారు. డీఎంకే యువజన విభాగం తన పుట్టిల్లులాంటిదని, తానీ స్థాయికి చేరడానికి ఆ విభాగమే కారణమన్నారు. యువజన విభాగం సభ్యులందరూ డీఎంకే చరిత్రను సమగ్రంగా తెలుసుకోవాలని, ప్రత్యేకించి తమిళ సాహిత్యం గొప్పదనాన్ని, తమిళ సంస్కృతీ సంప్రదాయాలను తెలుసుకుని వాటిని కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. పదేళ్లుగా కేంద్ర పాలకులు రాష్ట్రాల హక్కులన్నింటినీ హరించి వేశారని, ప్రస్తుతం రాష్ట్రాన్ని అన్ని విధాలా అణగదొక్కుతున్న బీజేపీని, మరోవైపు ఆ పార్టీకి పరోక్షంగా మద్దతునిస్తున్న బానిస పార్టీ అన్నాడీఎంకే ఎన్నికల్లో గెలుస్తామంటూ గొప్పలు చెప్పుకుంటున్నాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రాలకు హక్కులంటే తన రాష్ట్రానికే హక్కులు కావాలని కోరడం లేదని, కాంగ్రెస్ వంటి ప్రతిపక్షాలు పరిపాలిస్తున్న రాష్ట్రాలకు హక్కులు కావాలనే అడుగుతున్నానని చెప్పారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ తిరుచ్చి సభలో పాల్గొన్నప్పుడు రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి హక్కులు సమకూర్చాలని విజ్ఞప్తి చేశానని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రధానిగా ఉన్న మోదీ గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగాను పనిచేశారని, ప్రస్తుతం అన్ని రాష్ట్రాలను ఏకమొత్తంగా నాశనం చేసే ప్రయత్నాల్లో ఉన్నారని చెప్పారు. రాష్ట్రాలకు సంబంధించిన చట్టాలను కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వాటి అభిప్రాయాలను తెలుసుకోకుండా అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో తుఫాను, వరదలు సంభవిస్తే నిధులు విడుదల చేయాలని కోరితే కేంద్రం పట్టించుకోలేదని, తక్షణమే రూ.37 వేల కోట్ల మేరకు నిధులు కావాలని అడిగామని, ఇప్పటి వరకూ చిల్లిగవ్వ ఇవ్వలేదన్నారు. ప్రధాని సహా కేంద్రమంత్రులు వరద ప్రాంతాలను పరిశీలించి ఒట్టి చేతులు విదిలిస్తున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపించేందుకు పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే తీవ్రంగా పాటుపడాలని పిలుపునిచ్చారు.

అరిచ్చలైమునైలో ప్రధాని మోదీ పూజలు

- కడలి ఒడ్డున ధ్యానం
- కోదండ రామాలయం సందర్శన
- సేతు స్తూపానికి పుష్పాంజలి

చెన్నై, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ రామేశ్వరం సమీపం ధనుష్కోడి వద్ద, బంగాళాఖాతం, హిందూమహాసముద్రం కలిసే చోట 'సేతు బంధన తీర్థం' అనే పౌరాణిక నామధేయం కలిగిన అరిచ్చలై మునైని ఆదివారం ఉదయం సందర్శించారు. శనివారం ఉదయం శ్రీరంగం, సాయంత్రం రామేశ్వరంలలో పర్యటించిన విషయం విదితమే. ఈక్రమంలో రామేశ్వరంలోని శ్రీరామకృష్ణ మఠంలో మోదీ రాత్రి బసచేశారు. ఆదివారం ఉదయం ఆయన మఠం నుంచి కారులో బయలుదేరి 20కి.మీ.ల దూరంలో ఉన్న ధనుష్కోడికి పయనమయ్యారు. అక్కడి అరిచ్చలై మునైకి చేరుకున్నారు. రామాయణ ఇతిహాసంలో అత్యంత కీలకమైన ఘట్టమైన రామసేతు నిర్మాణానికి శ్రీకారం చుట్టి ఇరువైపులా సముద్రతీరాలు కలిగిన ఆ ప్రాంతం వద్ద మోదీ శివ పూజను నిర్వహించారు. రామసేతు నిర్మాణం ప్రారంభమైన చోట నిలిచి సముద్రజలాలను చేతపట్టుకుని సూర్యభగవానుడిని ప్రార్థించారు. అరిచ్చలైమునై వద్దే సీతాదేవి అయోధ్యకు తిరిగి వెళుతూ సైకత లింగాన్ని ప్రతిష్ఠించిందని పురాణగాథ. ఆప్రాంతం వద్దే ప్రధాని మోదీ సముద్ర స్నానమాచరించి వెదురుబుట్టల్లో వివిధరంగులపుష్పాలను తీసుకెళ్లి సీతాదేవి సైకత లింగాన్ని సృష్టించిన స్థలంపై అలంకరించి నమస్కరించారు. ఆ తర్వాత కాసేపు కడలి అందాలను ఆస్వాదించారు. పిమ్మట కడలి ఒడ్డున కుర్చీలో ఆసీనులై ప్రాణాయామంచేశారు. చివరగా అరిచ్చలై మునై వద్ద స్మారకస్తూపంవద్ద పుష్పాంజలి ఘటించారు. అక్కడి నుంచి కారులో కోదండరామాలయానికి చేరుకున్నారు. ఈ ఆలయం వద్దే రావణసంహారం తర్వాత రామచంద్రమూర్తి విభీషణుడికి లంకారాజ్య పట్టాభిషేకాన్ని జరిపించారని పౌరాణికగాథ. ఆ ఆలయం వద్ద మోదీకి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో మూలవిరాట్టుకు ప్రత్యేకపూజలు, దీపారాధన చేయించారు. అటుపిమ్మట ఉదయం 11.30 గంటలకు రామేశ్వరం పర్యటనను ముగించుకుని శ్రీరంగం, రామేశ్వరం, ధనుష్కోడి తదితర ప్రాంతాల్లో సేకరించిన పవిత్ర జలాల కలశాలతో హెలికాప్టర్‌లో మదురైకి బయలుదేరారు.





తీరం వద్ద ప్రాణాయామం చేస్తున్న మోదీ - శివపూజ చేస్తున్న మోదీ - కోదండరామాలయంలో దర్శనానికి వెళుతున్న మోదీ



పావుగంట... పలకరింపులు...

మధ్యాహ్నం 12.15 గంటలకు మదురై విమానాశ్రయంలో దిగిన ప్రదాని మోదీకి కేంద్ర మంత్రి ఎల్.మురుగన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం, ఆయన కుమారుడు ఎంపీ రవీంద్రనాథ్ తదితరులను సుమారు పావుగంటసేపు పలకరించారు. ఆ తర్వాత మోదీ ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. మోదీ రామేశ్వరం పర్యటన సందర్భంగా సుమారు నాలుగు వేలమంది పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఆదివారం పర్యాటకులతో గుమికూడే అరిచ్చలై మునై వద్ద వారిని అనుమతించకుండా పోలీసులు కట్టుదిట్టం చేశారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత రామేశ్వరం ఆలయంలో భక్తులను దర్శనానికి అనుమతించారు.

నేడు ఆలయాల్లో పూజలపై ఆంక్షలు లేవు

ప్రభుత్వ ప్రకటన




నిర్మలా సీతారామన్ - శేఖర్‌బాబు

చెన్నై, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామాలయ ప్రారంభోత్సవ సందర్భంగా సోమవారం రాష్ట్రంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించకూడదని, అన్నదానం చేయకూడదని ఆంక్షలు విధించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రకటనలను రాష్ట్రప్రభుత్వం ఖండిస్తూ ఓ ప్రకటన జారీచేసింది. దీనిపై రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు స్పందిస్తూ... ఓ తమిళ దినపత్రికలో ప్రచురించిన తప్పుడు వార్తను పట్టుకుని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం రాష్ట్రంలోని ఆలయాల్లో పూజలు, అన్నదానాలు గానీ జరగవని విమర్శస్తూ ప్రకటన చేయడం గర్హనీయమన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ నిజానిజాలు తెలుసుకోకుండా డీఎంకే యువజన మహానాడుకు లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే ఆరోపణలు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో... ఓ తమిళ దినపత్రికలో అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం రాష్ట్రంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు రద్దు చేసిందని, అన్నదానాలను నిలిపివేయనున్నదని తప్పుడు వార్తను ప్రచురించిందని పేర్కొంది. ఆ వార్త నిజమని భావించి కొందరు ప్రభుత్వంపై విమర్శలు చేయడం భావ్యం కాదనింది. రాష్ట్ర ప్రభుత్వం హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని అన్ని ఆలయాల్లోనూ నిత్యపూజలు, ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలను నిలిపివేయాలని ఏనాడూ ఆంక్షలుగానీ, ఉత్తర్వులు గానీ జారీ చేయదని పేర్కొంది. తప్పుడు వార్తను ప్రచురించిన తమిళ దినపత్రికపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ప్రభుత్వం ఆ ప్రకటనలో హెచ్చరించింది.

సమాచార దర్శిని

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, జనవరి 21: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా స్థానిక కేకే నగర్, అంబత్తూర్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

కేకే నగర్: ఆళ్వార్‌తిరునగర్ అన్ని వీధులు

అంబత్తూర్: జేజే నగర్, మొగప్పైర్ ఈస్ట్ 1 నుంచి 12 బ్లాక్‌లు, కలెక్టర్ నగర్, పాడికుప్పం, రైల్ నగర్, గోల్డన్ జార్జి నగర్, రత్నవేల్ పాండ్యన్ రోడ్డు, చర్చి రోడ్డు, వేణుగోపాల వీధి

రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

పెరంబూర్, జనవరి 21: స్థానిక తేనాంపేట మండలం వెంకటనారాయణ రోడ్డు, సేమియర్స్ రోడ్డులో తాగునీటి పైప్‌లైన్ అనుసంధానపనులు చేపట్టనుండడంతో ఈనెల 23నఉదయం 6నుంచి 24వ తేది ఉదయం 6 గంటల వరకు తేనాంపేట, కోడంబాక్కం, అడయార్ తదితర మండలాల్లో తాగునీటి సరఫరా ఉండదు. ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామని, అత్యవసర సేవకు ట్యాంకర్ల ద్వారా నీరు పొందేందుకు https://cmwssb.tn.gov.in అనేవెబ్‌సైట్‌లోనమోదు చేసుకోవచ్చని చెన్నై మెట్రోవాటర్ బోర్డు తెలిపింది.

రేపు ఎంఎన్ఎం సమావేశం

పెరంబూర్, జనవరి 21: మక్కల్ నీతిమయ్యం (ఎంఎన్ఎం) నిర్వాహక కమిటీ, కార్యవర్గ సమావేశం ఈనెల 23న జరుగుతుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎ.అరుణాచలం పేర్కొన్నారు. ఆళ్వార్‌పేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు పార్టీ అధ్యక్షుడు కమలహాసన్ నేతృత్వంలో ఈ సమావేశాలు జరుగుతాయన్నారు. రానునన పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకే కూటమిలో ఎంఎన్ఎం పోటీ చేయనుందనే వార్తల నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం సంతరించుకుంది.

యూట్యూబ్ ఛానల్ ప్రారంభంపై శిక్షణ

పెరంబూర్, జనవరి 21: తమిళనాడు ఔత్సాహిక పారిశ్రామిక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యూట్యూబ్ ఛానల్ ప్రారంభంపై మూడు రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 29 నుంచి 31వ తేది వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే శిక్షణలో యూట్యూబ్ ఛానల్ ప్రారంభం, వీడియో, స్లైడ్‌షో రూపొందించడం, అప్‌లోడ్ చేయడం, సోషల్ మీడియా, వినియోగదారుల నెట్‌వర్క్ పెంచుకోవడం తదితరాలపై వివరించనున్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన 18 ఏళ్ల పైబడిన యువతీ, యువకులు పాల్గొనవచ్చు. వివరాలకు www.editn.in అనే వెబ్‌సైట్, స్థానిక ఈకాట్టుతాంగళ్‌లోని సంస్థ కార్యాలయం, నెం.044-22252081, 22252082, 8668102600, 8668100181, 7010143022లలో ఈనెల సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 10నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు సంప్రదించవచ్చు.

బీఎడ్ దరఖాస్తుల స్వీకరణ

ఐసిఎఫ్, జనవరి 21: తమిళనాడు సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది బీఎడ్ దూరవిద్యలో చేరేందుకు దరఖాస్తుల స్వీకరణ ఈనెల 20న ప్రారంభమైంది. డిప్లొమా, డిగ్రీ చేసిన వారు, విధుల్లో ఉన్న ఉపాధ్యాయులు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. వర్సిటీ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకొని పూర్తిచేసి పంపించాలి. ఇతర వివరాలకు నెం.044-24306657, 9976698244 లలో సంప్రదించవచ్చు.

ఐఏఎస్ అధికారుల బదిలీ

ఐసిఎఫ్, జనవరి 21: ఐఏఎస్ అధికారులు ఆరుగురిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. వ్యవసాయ శాఖ కమిషనర్ సుబ్రమణియన్ తమిళ అభివృద్ధి, సమాచార శాఖ కార్యదర్శిగా, దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యదర్శి జయశ్రీ మురళీధరన్ సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శిగా, జలవనరుల శాఖ కమిషనర్ నాగరాజన్ దివ్యాంగుల సంక్షేమ శాఖ కమిషనర్‌గా, మత్స్యశాఖ కమిషనర్ పళనిస్వామి భూ, జల నిర్వహణశాఖ కమిషనర్‌గా, అలాగే, సాంఘిక సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శి జడాక్ చిరు మత్స్యశాఖ కమిషనర్‌గా, తమిళ అభివృద్ధి, సమాచారశాఖ కార్యదర్శి సెల్వరాజ్ రహదారులప్రణాళికడైరెక్టర్‌గా నియమితులయ్యారు.

పాల ఉత్పత్తిదారులకు రూ.3 ప్రోత్సాహక రుసుము

ఐసిఎఫ్, జనవరి 21: ప్రాథమిక పాల ఉత్పత్తిదారుల సహకార సంఘానికి పాలు అందజేసే వారికి లీటరుకు రూ.3 ప్రోత్సాహక రుసుము అందించనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. పశువుల పర్యవేక్షణ, దాణా ఖర్చులు పెరగడంతో పాల కొనుగోలు ధర పెంచాలని ఉత్పత్తిదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.వారికోరిక పరిశీలించిన ప్రభుత్వం, లీటరుకు రూ.3 పెంచుతూ జీవో విడుదల చేసింది.

రాష్ట్ర విద్యుత్ బోర్డుకు 'ఏ' గ్రేడ్

ఐసిఎఫ్, జనవరి 21: రాష్ట్ర విద్యుత్ బోర్డుకు కేంద్ర విద్యుత్ శాఖ 'ఏ' గ్రేడ్ ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఉన్న విద్యుత్ పంపిణీ సంస్థల 2022-23 సంవత్సరానికి సంబంధించి వినియోగదారుల సేవలకు సంబంధించి ర్యాంకుల జాబితాను కేంద్ర విద్యుత్ శాఖ విడుదల చేసింది. ఈ జాబితాలో అన్ని రాష్ట్రాలు, యూనియన్ ప్రదేశాల్లో ఉన్న 52 ప్రభుత్వ, 10 ప్రైవేటు అని మొత్తం 62 విద్యుత్ పంపిణీ సంస్థలు ఉన్నాయి. విద్యుత్ కనెక్షన్లు, బిల్లు వసూలు, సమస్యల పరిష్కారం, సరఫరా వంటి ఆధారంగా గ్రేడ్లు అందిస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యుత్ బోర్డుకు 'ఏ' గ్రేడ్ లభించింది. 2021-22 సంవత్సరంలో 'బి ప్లస్' గ్రేడ్ లభించింది.

కోయంబేడు నుంచే ఆమ్నీ బస్సు సేవలు

ప్యారీస్, జనవరి 21: నగర శివారు ప్రాంతమైన కిళంబాక్కం బస్ స్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించే వరకు ఆమ్నీ బస్సులు ఎప్పటిలాగే కోయంబేడు నుంచే బయలు దేరుతాయని తమిళనాడు ఆమ్నీ బస్సుల యజమానుల సంఘం స్పష్టం చేసింది. కిళంబాక్కం బస్ టెర్మినల్‌లో ఆమ్నీ బస్సులకు ప్రత్యేక స్థలం కేటాయించారని, అయితే వసతులు కల్పించలేదని తెలిపారు. పొరుగు జిల్లాల నుంచి సుమారు 1,000కి పైగా ఆమ్నీ బస్సులు ప్రతిరోజు చెన్నైకు వస్తుంటాయని, అయితే 100 బస్సులు నిలిపేందుకు మాత్రమే ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. చెన్నైలోని పలు ప్రాంతాల్లో ప్రైవేటు టూరిస్ట్ సంస్థలకు చెందిన పార్కింగ్ స్థలాల నుంచి ఆమ్నీ బస్సులు ప్రయాణికులతో బయల్దేరుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా కిళంబాక్కంలో దిగే ప్రయాణికులు నగరానికి చేరుకొనేందుకు సిటీ బస్సుల వసతి లేక తంటాలు పడుతున్నారని, అందువల్ల ఈ సమస్యలన్నీ తీరే వరకు కోయంబేడు నుంచే బస్సులు నడుపుతామని యజమానులు తేల్చి చెప్పారు.

ముగ్గురు పోలీసులకు కేంద్రప్రభుత్వ సత్కారం

ఐసిఎఫ్, జనవరి 21: నేరస్తులను పట్టుకోవడంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించిన ముగ్గురు పోలీసులను కేంద్రప్రభుత్వం సన్మానించింది. ఉత్తమ సేవలందించిన తిరునల్వేలి ఎస్ఐ మార్గరేట్ థెరిస్సా, చెన్నై ఫస్ట్ గ్రేడ్ కానిస్టేబుల్ శ్రీరంగన్, తూత్తుకుడి ఫస్ట్ గ్రేడ్ కానిస్టేబుల్ జాన్‌పాల్‌ను కేంద్రప్రభుత్వం సన్మానించింది.




మహానాడు ప్రవేశద్వారంవద్ద పార్టీ పతాకానికి ఇరువైపులా పార్టీ శ్రేణులు - ఓపెన్‌టాప్ జీపులో ప్రాంగణానికి విచ్చేస్తున్న ఉదయనిధి

డీఎంకే యువజన మహానాడుకు భారీ ఏర్పాట్లు

చెన్నై, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా పెద్దనాయకన్ పాళయంలో ఆదివారం ఉదయం జరిగిన డీఎంకే యువజన విభాగం ద్వితీయ మహానాడుకు భారీ ఏర్పాట్లు చేపట్టారు. మహానాడు వేదిక ప్రవేశ ద్వారం వద్ద డీఎంకే దివంగత నేతల శిల్పాలను తలపించేలా భారీ సెట్టింగ్‌ను ఏర్పాటు చేశారు. అదే విధంగా మహానాడు ప్రవేశద్వారం వద్ద ఎత్తయిన పార్టీ పతకాన్ని ప్రతిష్ఠించారు. అంతే కాకుండా గత రెండు రోజులుగా మహానాడు ప్రాంతం వద్ద వేదిక చివరిదశ నిర్మాణ పనులలో పాల్గొన్నవారికి, శనివారం సాయంత్రం నుండి ఆదివారం ఉదయం వరకూ విచ్చేసిన కార్యకర్తలందరికీ రుచికరమైన భోజన సదుపాయం కల్పించారు.

భారీ వంటశాలలు...

మహానాడుకు విచ్చేసిన పార్టీ శ్రేణులకు శాకాహార, మాంసాహార వంటకాలతో పసందైన విందును ఏర్పాటు చేశారు. మహానడు పందిరికి కుడివైపున రెండు ప్రాంతాల్లో పాకశాలలు ఏర్పాటు చేశారు. శాకాహార ప్రియులకు వెజిటబుల్ బిర్యానీ, బ్రెడ్ హల్వా, గోబీ65, పెరుగన్నం, ఊరగాయ, గుత్తివంకాయ వడ్డించారు. మాంసాహార ప్రియులకు మటన్ బిర్యానీ, చికెన్-65, బ్రెడ్ హల్వా, వంకాయ, పెరుగన్నం, ఊరగాయ వడ్డించారు. ఈ మహానాడు వంటకాల కోసం ఐదువేలకు పైగా మేకలు, 15 వేలకు పైగా కోళ్ళు, 30 టన్నుల కూరగాయలను చెన్నై కోయంబేడు నుండి తరలించారు. 100 మంది పాకశాస్త్ర ప్రవీణులు, 500 మంది సహాయకులు, 6500 మంది కార్మికులు వంట పనుల్లో పాల్గొన్నారు. రెండు లక్షలమందికిపైగా యువజన విభాగం నిర్వాహకులకు మాంసాహార భోజనాలు, 50 వేల మందికి పైగా నిర్వాహకులకు శాకాహార భోజనాలు వడ్డించారు.

భారీ పతాకం...

యువజన మహానాడు ప్రారంభం సందర్భంగా ప్రవేశద్వారం వద్ద వంద అడుగుల ఎత్తున పార్టీ పతాక స్తంభం ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, డీఎంకే యువజన విభాగం నాయకుడు ఉదయనిధి సమక్షంలో పార్టీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ కనిమొళి ఆ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆ పార్టీ పతాకం 16 అడుగుల ఎత్తు, 26 అడుగుల వెడల్పుతో తయారు చేశారు. ఆ తర్వాత దివంగత నాయకులు పెరియార్, అన్నాదురై, కరుణానిధి, అన్బళగన్ విగ్రహాలకు స్టాలిన్, ఉదయనిధి, కనిమొళి పూలమాలలు వేసి నివాళిర్పించారు. వీరితోపాటు పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్, కోశాధికారి టీఆర్‌బాలు, మంత్రి కేఎన్ నెహ్రూ, ఎంపీ ఎ. రాజా, మంత్రులు రఘుపతి, మూర్తి, అనితా రాధాకృష్ణన్, పీకే శేఖర్ బాబు, గీతా జీవన్, సీవీ గణేశన్, ముత్తుసామి, సెంజి మస్తాన్, కయల్‌విళి, జిల్లా శాఖ కార్యదర్శులు శివలింగం, రాజేంద్రన్, సెల్వగణపతి తదితరులు కూడా పాల్గొన్నారు.

పసుపు సంచుల్లో తినుబండారాలు...

ఈ మహానాడులో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది కార్యకర్తలు ఆదివారం వేకువజాము తరలివచ్చారు. మహానాడు పందిరి దిగువన 1.5లక్షల మంది ఆశీనులయ్యేందుకు వీలుగా కుర్చీలు ఏర్పాటు చేశారు. ఆ కుర్చీల్లో వాటర్‌బాటిల్, బిస్కెట్, బ్రెడ్, మిక్సర్ ప్యాకెట్‌ను పసుపు సంచుల్లో ఉంచారు. అంతే కాకుండా గ్యాలరీలకు చేరువగా వాటర్ బాటిళ్లను అందుబాటులో ఉంచారు.

72 ఎల్ఈడీ స్క్రీన్లు...

ఈ మహానాడు సమావేశ దృశ్యాలను అందరూ ఎలాంటి శ్రమలేకుండా తిలకించడానికి వీలుగా 72 భారీ ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. మహానాడు సభ దృశ్యాలను వాటిపై ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఇదే విధంగా ప్రవేశ ద్వారం ముందు కూడా నాలుగు భారీ సైజు ఎల్ఈడీ స్క్రీన్లలో మహానాడు దృశ్యాలను ప్రత్యక్ష ప్రసారం చేశారు.

నీట్ వ్యతిరేక సంతకాల కార్డులు...

మహానాడు వేదిక సమీపంలో నీట్‌కు వ్యతిరేకంగా డీఎంకే యువజన విభాగం ఆధ్వర్యంలో జరిపిన సంతకాల ఉద్యమంలో సేకరించిన సంతకాల కార్డులను కూడా ప్రదర్శనకు ఉంచారు. సుమారు కోటికిపైగా ఉన్న ఆ సంతకాల అట్టలను చూసి కార్యకర్తలు ఆశ్చర్యపోయారు.



మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న స్టాలిన్



టీఆర్‌బాలు, దురైమురుగన్, ఉదయనిధి, కనిమొళికి సత్కారం



మహానాడు వేదికను ప్రారంభిస్తున్న డీఎంకే విద్యార్థి విభాగం నాయకుడు ఎళిల్ అరసన్





మహానాడులో పాల్గొన్న యువజన విభాగం సభ్యులు, పార్టీ ప్రముఖులు - మహానాడులో ప్రసంగించిన న్యాయవాది అరుళ్‌మొళికి, మంత్రి తంగం తెన్నరసుకు జ్ఞాపికను బహూకరిస్తున్న ఉదయనిధి

బీజేపీ పాలకులను ప్రశ్నిస్తే మనపై 'ఐస్' పెడతారు!



చెన్నై, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణంగా నిర్మించని ఆలయాన్ని ప్రారంభించకూడదని హిందూమతం ఎలుగెత్తి చాటుతోందని దీన్ని ప్రశ్నిస్తే 'ఐస్' పెడతారని డీఎంకే డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎంపీ కనిమొళి వ్యంగ్యాస్త్రం విసిరారు. ఆదివారం ఉదయం సేలం జిల్లా పెద్దనాయకన్ పాళయంలో డీఎంకే యువజన విభాగం మహానాడులో ఆమె పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. రాజకీయస్వార్థం కోసం కేంద్రంలోని బీజేపీ పాలకులు హిందువుల మనోభావాలను గౌరవించకుండా అసంపూర్ణంగా నిర్మించిన అయోధ్య రామాలయాన్ని ప్రారంభించనున్నారని, దీని ప్రశ్నిస్తే 'ఐస్' పెడతారని... అంటే ఇన్‌కమ్‌టాక్స్, సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్లను తమపై ఉసిగొల్పుతారని ఆమె విమర్శించారు. అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి అందరినీ ఆహ్వానించి రాష్ట్రపతిని ఎందుకు పిలవలేదని కూడా తాను ప్రశ్నించదలచుకోలేదని, సోమవారం ఆ ఆలయ ప్రారంభోత్సవాల్లో పాల్గొనాల్సిన ప్రధాని మోదీ ఇవేవీ పట్టించుకోకుండా నేడు క్షేత్రాటన చేస్తున్నారని మండిపడ్డారు. డీఎంకే పాలనలో అందరికీ అన్నీ లభిస్తూ సుభిక్షంగా ఉన్నారు కదా పార్టీ పతాకంలో ఇంకా నలుపురంగు ఎందుకు... ఎరుపు రంగుగా మార్చవచ్చును కదా అని అడుగుతున్నారని, అయితే దక్షిణభారత మంతటా అరుణకాంతులు వ్యాపించాయని, ఉత్తరభారతం ఇంకా అంధకారం నుంచి బయటపడలేదు కనుక నలుపు రంగును కొనసాగాల్సి వచ్చిందన్నారు. ఓ ప్రైవేటు ట్రస్టు ఆధ్వర్యంలో ప్రారంభించాల్సిన ఆలయం కోసం హాఫ్‌డే సెలవు, ఉచిత రైళ్లను నడపడం ఎందుకని మనం ప్రశ్నిస్తే షరా మామూలుగా మనకు 'ఐస్' పెడతారంటూ కనిమొళి సభికులను నవ్వించారు.



331 కావళ్లతో పళనికి భక్తుల పాదయాత్ర

ప్యారీస్, జనవరి 21: శివగంగ జిల్లాకు చెందిన భక్తులు 331 కావళ్లతో దిండుగల్ జిల్లాలో ప్రసిద్ధిచెందిన పళని దండాయుధపాణి ఆలయానికి పాదయాత్ర చేపట్టారు. ఈ నెల 25న పళని క్షేత్రంలో కోలాహలంగా నిర్వహించనున్న తైపూసం ఉత్సవాల్లో పాల్గొననున్నారు. 28న మకం నక్షత్రంలో కొండపై కొలువై ఉన్న స్వామివారి సన్నిధిలో ఈ కావళ్లను మొక్కుబడిగా చెల్లించనున్నారు. శివగంగ జిల్లా నెర్కుప్పం, కండనూరు, కారైక్కుడిలకు చెందిన సుబ్రమణ్యస్వామి భక్తులు 400 ఏళ్లుగా 21 రోజుల పాదయాత్రగా కుండ్రకుడి నుంచి పళనికి వెళుతున్న ఆచారం ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ భక్తులు వెళ్లే దారిపొడవునా పలు హిందూ సంస్థల తరఫున పూలు చల్లి స్వాగతం పలకడంతో పాటు అన్నదానం, మజ్జిగ తదితరాలను పంపిణీ చేస్తున్నారు.

పొదుపు సొమ్ముతో విమాన ప్రయాణం

దీర్ఘకాల కోరిక నెరవేర్చుకున్న గ్రామస్తులు

పెరంబూర్, జనవరి 21: తమ దీర్ఘకాల కోరికగా ఉన్న విమాన ప్రయాణాన్ని ఎట్టకేలకు గ్రామస్తులు నెరవేర్చుకున్నారు. తిరునల్వేలి జిల్లా అంబ సమీపం తట్టాన్‌పట్టిలో సుమారు 200 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ గ్రామ యువకులు అధికంగా సైనికులు, పోలీసులు, వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్నారు. ఈ గ్రామానికి చెంది సైనికులుగా పనిచేస్తున్న యువకులు విమానం ద్వారా సొంతూరికి వస్తుంటారు. దీంతో, అక్కడి గ్రామస్తులకు కూడా విమానంలో ప్రయాణించాలనే కోరిక కలిగింది. అందుకు నగదు అధికంగా కావాల్సి ఉండడంతో, చిన్న మొత్తంలో పొదుపు చేయాలని నిర్ణయించారు. అందుకోసం 10 ఏళ్లుగా పొదుపు చేసిన సొమ్ముతో ప్రస్తుతం విమానంలో ప్రయాణించారు. ఈ విషయమై గ్రామానికి చెందిన యువకులు మాట్లాడుతూ... గ్రామానికి చెందిన మహిళలు, పురుషులు, చిన్నారులు అని మొత్తం 134 మంది శుక్రవారం రాత్రి విమానంలో కోయంబత్తూర్‌కు వెళ్లారు. అక్కడ రెండు రోజులు బసచేసి సవేరియార్ ఆలయాన్ని దర్శించుకొని మళ్లీ రైలులో స్వగ్రామానికి వెళ్లనున్నారు. ఈ ప్రయాణ ఖర్చులకు పదేళ్లుగా దాచుకున్న నగదును వినియోగించినట్లు వారు పేర్కొన్నారు. కాగా, విమాన ప్రయాణానికి వెళ్లే ముందు గ్రామంలోని అరుళానందర్ స్వామి ఆలయం వద్ద గ్రామస్తులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.



← అరుళానందర్ ఆలయం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న గ్రామస్తులు

ప్రధానిని కలవడం కూటమికి సంబంధం లేదు

టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్

పెరంబూర్, జనవరి 21: రాష్ట్రంలో మూడు రోజుల పర్యటన కోసం వచ్చిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి తమిళ మానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జేకే వాసన్ ఆహ్వానం పలికారు. ఈ నేపథ్యంలో, ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... ప్రధాని మోదీని నేరుగా ఆహ్వానించడంలో ఎన్నికల కూటమికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఎన్నికలకు ఇంకా మూడు నెలల గడువు ఉందని, తగిన సమయంలో కూటమిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. అదే సమయంలో ఎన్నికలకు పార్టీ నేతలు, కార్యకర్తలు సన్నద్ధం చేయడం, ప్రజలను కలుసుకోవడం తదితరాలపై జిల్లావారీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు జీకే వాసన్ తెలిపారు.

సీట్ల సర్దుబాటు చర్చలకు కమిటీ: ఎండీఎంకే

పెరంబూర్, జనవరి 21: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకే కూటమిలో పోటీచేస్తున్న ఎండీఎంకే సీట్ల సర్దుబాటు, ఎన్నికల ప్రణాళిక తయారీకి రెండు కమిటీలు ఏర్పాటు చేసింది. సీట్లు సర్దుబాటు చర్చలకు ఏర్పాటుచేసిన కమిటీలో పార్టీ ప్రిసీడియం చైర్మన్ అర్జునరాజ్, కోశాధికారి సెందిలదిపన్, ఆంద్రిదాస్, వి.శేషన్ ఉన్నారు. అలాగే, ఎన్నికల ప్రణాళిక తయారీ కమిటీలో పార్టీ సంయుక్త కార్యదర్శి రాజేంద్రన్, వందియదేవన్, సెందిల్ సెల్వన్, ఆసైతంబి తదితరులను నియమించినట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి వైగో పేర్కొన్నారు.

ఎస్ఐల బదిలీకి ఈసీ అనుమతి

ప్యారీస్, జనవరి 21: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఒకే ప్రాంతంలో మూడేళ్లకు పైగా విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులను బదిలీ చేసేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ అనుమతులు జారీ చేసింది. రాష్ట్రంలో మార్చి, ఏప్రిల్‌లో కానీ లోక్‌సభ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. ఎన్నికలకు సంబంధించిన ముందస్తు పనులు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా పోలీసు అధికారులను బదిలీ చేయాలంటూ రాష్ట్ర పోలీసు శాఖకు ఇటీవల ఈసీ లేఖ రాసింది. అందులో... పోలీసు శాఖలో ఎస్ఐ నుంచి ఏడీజీపీ వరకు పనిచేస్తున్న అధికారులు మూడేళ్లుగా ఒకే ప్రాంతంలో ఉన్నట్లయితే జిల్లా పరిధిలోనే బదిలీ చేయాలని డీజీపీ శంకర్ జివాల్ ఆదేశాలు జారీ చేశారు.

డీఎంకేలో వారసులకే రాజ్యాధికారం

పుదుచ్చేరి గవర్నర్ తమిళిసై

ప్యారీస్, జనవరి 21: డీఎంకేలో వారసులకే రాజ్యాధికారం కల్పిస్తున్నారని పుదుచ్చేరి గవర్నర్ తమిళిసై విమర్శించారు. సేలంలో డీఎంకే ద్వితీయ యువజన విభాగం మహానాడు ఆదివారం కోలాహలంగా నడిపిస్తున్న నేపథ్యంలో, తమిళిసై ఆ మహానాడుకు విమర్శిస్తూ ఆదివారం 'ఎక్స్' పేజీలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో భారీవర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ముందుగానే హెచ్చరికలు జారీ చేసిందని అయితే, వరదలను అడ్డుకొనేందుకు డీఎంకే ప్రభుత్వం ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టలేదన్నారు. కానీ, యువజన విభాగం మహానాడును ఘనంగా నిర్వహించేందుకు నెలరోజుల ముందు నుంచే భారీ ఏర్పాట్లు చేపట్టడంలో డీఎంకే పాలకులు ప్రత్యేక చర్యలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు అందరికీ ఉందని బల్ల గుద్ది చెబుతున్న డీఎంకే నాయకులకు కావేరి హక్కులు కోల్పోయింది ఎవరు అన్నది తెలియదా? కచ్చాదీవిని కోల్పోయింది ఎవరు? జల్లికట్టు హక్కులు చేజార్చుకున్నది ఎవరు? విద్యా హక్కులు కోల్పోయి విద్యార్థులను ముప్పతిప్పలు పాలు చేస్తున్నది ఎవరు? నీట్ ప్రవేశ పెట్టిందెవరు? అన్న సంగతి తెలియదా అని ఆమె సూటిగా ప్రశ్నించారు. ఈ రకంగా రాష్ట్ర హక్కులు కోల్పోయిన వారు నేడు హక్కుల పరిరక్షణ మహానాడు జరుపుకోవడం విడ్డూరమని తమిళిసై వ్యాఖ్యానించారు.

మదురైలో 'ఖేలో ఇండియా'లో క్రీడాకారులకు భోజనం కొరత

ప్యారీస్, జనవరి 21: మదురైలో ఆదివారం ఖేలో ఇండియా పోటీలు ప్రారంభమయ్యాయి. మంగళవారం వరకు మదురై ఎంజీఆర్ ప్లేగ్రౌండ్‌లో పోటీలు జరుగుతాయి. కలెక్టర్ సంగీత ప్రారంభించిన ఈ పోటీల్లో పాల్గొన్న తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పంజాబ్, బిహార్, గుజరాత్ తదితర 19 రాష్ట్రాలకు చెందిన పురుషులు, మహిళా క్రీడాకారులకు ఒక చపాతి, ఉడక బెట్టిన గుడ్డు మాత్రమే పంపిణీ చేశారని ఆరోపణలు తలెత్తాయి. దీనిపై స్పందించిన మదురై సీపీఎం పార్లమెంటు సభ్యుడు ఎస్.వెంకటేశన్, క్రీడాకారులకు భోజనం, తాగునీరు తదితర కనీస వసతులు మెరుగుపర్చేందుకు కలెక్టర్ చొరవ చూపాలని, భోజన ఏర్పాట్లపై ప్రైవేటు సంస్థకు కాంట్రాక్ట్ ఇచ్చారని, ఆ సంస్థతో మాట్లాడి సమస్యల పరిష్కరింపజేయాలని డిమాండ్ చేశారు.

నేడు యథావిధిగా అత్యవసర చికిత్సలు

హైకోర్టుకు తెలిపిన జిప్‌మర్ యాజమాన్యం

ప్యారీస్, జనవరి 21: అయోధ్య రామాలయ కుంభాభిషేకం ఉన్నప్పటికీ సోమవారం అత్యవసర చికిత్సలు నిర్వహించనున్నట్లు మద్రాసు హైకోర్టులో పుదుచ్చేరి జిప్‌మర్ ఆసుపత్రి యాజమాన్యం అఫిడవిట్ దాఖలు చేసింది. అయోధ్య రామాలయ కుంభాభిషేకం సందర్భంగా పుదుచ్చేరి జిప్‌మర్ ఆసుపత్రి సోమవారం మధ్యాహ్నం 2.30 గంటల వరకు పనిచేయదని జారీ చేసిన ప్రకటనపై విమర్శలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రకటన రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ కలాం వృక్షం అనే సాంఘిక సంస్థ వ్యవస్థాపకుడు రాజా మద్రాసు హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్ అత్యవసర కేసుగా పరిగణించిన న్యాయస్థానం సెలవు రోజైన ఆదివారం విచారణ చేపట్టింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గంగాపూర్‌వాలా, న్యాయమూర్తి భరత్ చక్రవర్తిలతో కూడిన ప్రథమ ధర్మాసనం ముందు పిటిషనర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ప్రకాష్ వాదిస్తూ జిప్‌మర్ ఆసుపత్రి మధ్యాహ్నం 2.30 గంటల వరకు పనిచేయదని ప్రకటించినందువల్ల చికిత్స కోసం వేచిన రోగులు ఇబ్బందుల పాలవుతారని వాదించారు. అందుకు జిప్‌మర్ ఆసుపత్రి తరపున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ సుందరేశన్... ప్రధాన అత్యవసర శస్త్రచికిత్సలకు ఎవరికి సమయం కేటాయించలేదని, అయినప్పటికీ యథావిధిగా చికిత్సలు కొనసాగుతాయని హామీ ఇస్తూ అఫిడవిట్ సమర్పించారు.

రూ.5కోట్ల కొకైన్ స్వాధీనం: ఇద్దరు నైజీరియన్ల అరెస్ట్

ప్యారీస్, జనవరి 21: స్థానిక షెనాయ్‌నగర్ మెట్రో రైల్వేస్టేషన్ సమీపంలో రూ.5 కోట్ల కొకైన్‌ను స్వాధీనం చేసుకొని ఇద్దరు నైజీరియా దేశస్తులను అరెస్ట్ చేశారు. ఈ రైల్వేస్టేషన్ సమీపంలో నిషేధిత మత్తు పదార్థాలను విక్రయిస్తున్నట్లు గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయానికి సమాచారం అందింది. జాయింట్ కమిషనర్ విజయకుమార్ ఉత్తర్వుల మేరకు అమింజికరై ఇన్‌స్పెక్టర్ కృపానిధి నేతృత్వంలో శనివారం షెనాయ్ నగర్ మెట్రో రైల్వేస్టేషన్ వద్ద నిఘా వేశారు. అప్పుడు పోలీసులను చూసి ఓ వ్యక్తి అక్కడి నుంచి పారిపోయేందుకు యత్నించగా అతన్ని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. అతని బ్యాగు తనిఖీ చేయగా 120 గ్రాముల కొకైన్ ఉన్నట్లు గుర్తించారు. విచారణలో... నైజీరియా దేశానికి చెందిన సింట్‌ఓనర్చి అని, అతను ముడిచూర్‌లో స్నేహితుడితో కలసి అద్దె ఇంట్లో నివసిస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో, కోయంబేడు బస్ టెర్మినల్ ప్రాంతంలో సంచరిస్తున్న సింట్‌ఓనర్చి మిత్రుడు సియోన్ ని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద రూ.5 కోట్ల విలువైన 1.120 కిలోల కొకైన్, రూ.5 లక్షల నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరు 2010వ సంవత్సరం నుంచి చెన్నైలోనే నివసిస్తున్నారని, సినిమాల్లో చిన్న చిన్న వేషాల్లో కూడా నటిస్తున్నట్లు తెలిసింది. బెంగళూరు నుంచి అక్రమంగా తరలించే కొకైన్‌ను చెన్నైలో విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తెలిసింది.

రాష్ట్రంలో వినికిడి లోపం కలిగిన వారి సంఖ్య ఎక్కువ

ఐసిఎఫ్, జనవరి 21: రాష్ట్రంలో 1,000 మందిలో ఆరుగురు పిల్లలకు పుట్టుకతోనే వినికిడిలోపం ఉందని ఈఎన్‌టీ నిపుణులు పేర్కొన్నారు. చెన్నైలో జరుగుతున్న అంతర్జాతీయ వైద్య మహానాడులో డాక్టర్ మోహన్ కామేశ్వరన్ మాట్లాడుతూ... అవయవాల లోపాల శాతానికి సంబంధించి ప్రపంచ, జాతీయ స్థాయిల్లో వినికిడి లోపమే రెండో స్థానంలో ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా 63 కోట్ల మంది ఈ లోపం కలిగి ఉన్నారన్నారు. రాబోయే 2050 నాటికి ఈ సంఖ్య 90 కోట్లకు పెరిగే అవకాశం ఉందన్నారు. భారతదేశానికి సంబంధించి 1,000 మంది పిల్లల్లో ఇద్దరికి ఈ లోపం ఉండగా, రాష్ట్రంలో ఈ సంఖ్య ఆరుగా ఉందని తెలిపారు. దీనికి ప్రధాన కారణం రక్త సంబంధీకులతో వివాహం చేసుకోవడం అన్నారు.

బంతి కోసం వెళ్లి... నీటి తొట్టెలో పడి బాలుడి మృతి

పెరంబూర్, జనవరి 21: క్రికెట్ బంతి కోసం వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు నీటితొట్టెలో పడి మృతి చెందాడు. చిన్నమలై ఎల్‌టీజీ రోడ్డుకు చెందిన డ్రైవర్ లూర్దురాజు, మోనీషా దంపతులకు ఆరోన్‌రాజ్ (7), రెండేళ్ల కుమార్తె ఉన్నారు. ఆరోన్ అదే ప్రాంతంలోని పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. శనివారం సాయంత్రం పాఠశాల ముగిసిన అనంతరం ఇంటి సమీపంలో స్నేహితులతో కలసి క్రికెట్ ఆడుతున్నాడు. ఆ సమయంలో బంతి సమీపంలో తాళం వేసిన ఇంటి ప్రాంగణంలో పడింది. దీంతో, ఆరోన్ బంతి కోసం మోటర్‌సైకిల్ ఎక్కి ప్రహరీ నుంచి దూకాడు. ఐదు నిముషాల వరకు అతను రాకపోవడంతో స్నేహితులు ఆ ప్రాంతంలో గాలించినా ఫలితం లేకపోవడంతో తల్లితండ్రులకు తెలియజేశారు. వారు ఇంటి ప్రాంగణంలోకి వెళ్లి చూడగా, గోడ పక్కనే ఉన్న 10 అడుగుల లోతున్న ట్యాంక్‌లో ఆరోన్ వెలికితీసి సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఒకే రాత్రి జరిగే కథ 'ఎగ్జిట్'

చిత్రజ్యోతి

● ట్రైలర్ రిలీజ్



'ఎగ్జిట్‌'లో శ్రీరామ్

'పసంగ' ఫేం శ్రీరాం కథానాయకుడిగా నటించిన 'ఎగ్జిట్' సినిమా స్టోరీ ఒకే రాత్రిలో జరిగేలా తెరకెక్కించారు. ఈ మూవీ ట్రైలర్‌ను తాజాగా రిలీజ్ చేశారు. సర్వైవల్ థ్రిల్లర్‌గా రూపొందించారు. ఎగ్జిట్ అనేది బయటకు వెళ్ళే మార్గం. కానీ, ఈ సినిమాలో ప్రాణాలు హరించే మార్గంగా మారుతుంది. అలాంటి క్లిష్టపరిస్థితుల్లో చిక్కుకున్న హీరో తన ప్రాణాలను ఏ విధంగా రక్షించుకున్నాడన్నదే ఈ చిత్ర కథ. డెబ్యూ డైరెక్టర్ షాహీన్ దర్శకత్వం వహించారు. బ్లూమ్ ఇంటర్నేషనల్ బ్యానరుపై వేణుగోపాలకృష్ణన్ నిర్మించారు. ఈ చిత్రంలో శ్రీరాం అద్భుతమైన నటనతో ప్రేక్షకులను అలరించనున్నారు. తమిళం, మలయాళం భాషల్లో రూపొందించారు. శ్రీరాంతో పాటు రనీషా రహిమాన్, హరీస్, పేరడి, వైజాగ్ విజయన్, అశ్విన్ జోసెఫ్, సూరజ్ తదితరులు నటించారు. ఈ సినిమాకు స్క్రీన్‌ప్లే అనీష్ జనార్దనన్, షాహీన్. కథ అనీష్ జనార్దనన్, కెమెరా రియాజ్ నిజాముద్దీన్, ఎడిటింగ్ నిషాద్ యూసుఫ్, సంగీతం ధనుష్ హరికుమార్.

'సమూగ విరోధి'కి సెన్సార్ చిక్కులు?



జియోన్ రాజా

జియోనా ఫిలిం ఫ్యాక్టరీ బ్యానరుపై జియోన్ రాజా కథను సమకూర్చి దర్శకత్వం వహించిన 'సమూగ విరోధి' చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్‌ను మంజూరు చేయడానికి కమిటీ సభ్యులు తర్జనభర్జన పడుతున్నారు. దీనికి కారణం లేకపోలేదు. ఈ చిత్రాన్ని చూసిన సెన్సార్ సభ్యులకు ఏ రకమైన సర్టిఫికెట్‌ను మంజూరు చేయాలన్న అంశంపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఇటీవల ఈ సినిమా ఆడియో, ట్రైలర్‌ను పలువురు సినీ రాజకీయ ప్రముఖుల సమక్షంలో అట్టహాసంగా విడుదల చేశారు. ఆ తర్వాత సినిమాను సెన్సార్‌కు పంపించారు. ఈ సినిమాను చూసిన సెన్సార్ సభ్యులు సర్టిఫికెట్ మంజూరుపై తర్జనభర్జన పడడంతో చిత్ర బృందం రివ్యూ కమిటీకి పంపించాలని నిర్ణయించింది.

'చిక్‌లెట్స్' ట్రైలర్ విడుదల



'చిక్‌లెట్స్' ఆడియో రిలీజ్‌లో చిత్ర బృందం

దర్శకుడు ఎం.ముత్తు తెరకెక్కించిన చిత్రం 'చిక్‌లెట్స్'. సాత్విక్ వర్మ, జాక్ రాబిన్‌సన్, రహీం, నయన్ కరిష్మా, అమృత, మంజీరా తదితరులు నటించారు. కొలంజి కుమార్ సినిమాటోగ్రఫీ సమకూర్చగా, బాల మురళి సంగీత స్వరాలు అందించారు. ఎస్ఎస్‌బీ ఫిలిమ్స్ బ్యానరుపై నిర్మాత ఏ.శ్రీనివాసన్ గురు నిర్మించారు. ఫిబ్రవరి 2వ తేదీన సినిమాను విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో చిత్రం ఆడియో, ట్రైలర్‌ను తాజాగా చెన్నైలో విడుదల చేశారు. ఇందులో సీనియర్ దర్శకుడు పేరరసు, ఆర్‌వీ ఉదయకుమార్, సీనియర్ నిర్మాత కె.రాజన్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేరరసు మాట్లాడుతూ, 'ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ రిలీజ్ వేడుకలో పాల్గొనని నటీనటులపై నిర్మాతల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలి. వారికి రెమ్యునరేషన్‌ను చెల్లించరాదు' అని సూచించారు. ఆర్‌వీ ఉదయకుమార్ మాట్లాడుతూ... 'ఈ చిత్రం గురించి ప్రతి ఒక్కరూ మాట్లాడారు. ట్రైలర్ చూస్తుంటే ఎంతో బాగుంది. ఇందులో నటించినవారంతా యువకులు. ఆశలేని జీవి ఏది ఉంది. కోరికలు లేని వారు మనుషులే కాదు. అందుకే ఈ చిత్రం ట్రైలర్‌కు హ్యాట్సాఫ్' అన్నారు. నిర్మాత కె.రాజన్ మాట్లాడుతూ... 'సినిమా ట్రైలర్ నీట్‌గా ఉంది. ఈ కాలానికి కావాల్సిన అన్ని అంశాలున్నాయి. తల్లిదండ్రులు - పిల్లల మధ్య ఉండే అవగాహనను వివరించే చిత్రంగా ఉంది. భార్య మాటను భర్త వింటాడా? లేక పిల్లల మాటలు తల్లిదండ్రులు వింటారా? అనే కథాంశంతో తెరకెక్కింది' అని అన్నారు. దర్శకుడు ఎం.ముత్తు మాట్లాడుతూ... 'తమిళం, తెలుగు భాషల్లో ఏక కాలంలో విడుదల చేస్తున్నాం. తమిళంలో తమిళ్ సినీ కార్పొరేషన్ అధినేత ఎస్.నందగోపాల్ విడుదల చేస్తున్నారు. కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రారంభించి అవాంతరాల మధ్య నిర్మాణం పూర్తి చేశాం' అని అన్నారు.

అట్టహాసంగా 'గోల్డెన్ ఫేస్ ఆఫ్ సౌత్ ఇండియా' ప్రారంభం



ప్రారంభోత్సవంలో దర్శకుడు విజయ్‌తో నిర్వాహకులు

దక్షిణ భారతదేశంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే 'గోల్డెన్ ఫేస్ ఆఫ్ సౌత్ ఇండియా' పోటీల ప్రారంభ సీజన్ శనివారం రాత్రి చెన్నైలోని ప్రముఖ నక్షత్ర హోటల్‌లో ప్రారంభమైంది. యాసిడ్ దాడి బాధితులకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలన్న ప్రధాన థీమ్‌తో ఈ సీజన్ పోటీలను ప్రారంభించారు. ఇందులో గౌరవ చైర్మన్, సినీ దర్శకుడు ఏఎల్ విజయ్, విండో ఎంటర్‌టైన్మెంట్ వ్యవస్థాపకుడు వి.శరవణన్, గోపీనాథ్ రవి, ఏసీటీసీ స్టూడియో వ్యవస్థాపకుడు, సీఈవో హేమంత్‌తో పాటు ఈ యాసిడ్ దాడి బాధితులకు మేలు చేకూర్చేలా చర్మదానంపై అవగాహన కల్పించే లక్ష్మీ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో బ్రాండ్ అంబాసిడర్ సినీ నటి పార్వతి నాయర్ పాల్గొని చర్మదానంపై అవగాహన కల్పించారు. అలాగే, పలువురు సినీ నటులు ఈ కార్యక్రమంలో పాల్గొని యాసిడ్ దాడి బాధితులకు అండగా ఉండటమే కాకుండా, చర్మదానంపై తమ వంతు ప్రచారం చేస్తామని పేర్కొన్నారు.

చరిత్రలో చిరస్మరణీయమైన రోజు

● రజనీకాంత్



అడయార్, జనవరి 21: అయోధ్య రామ మందిర నిర్మాణ వివాదం ఈ నాటిదికాదని 500 యేళ్లకు పైగా సాగిన సమస్యకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు చక్కటి పరిష్కారం చూపించడంతో చరిత్రలో చిరస్మరణీయమైన ఈ రోజును చూస్తున్నామని సూపర్‌స్టార్ రజనీకాంత్ అన్నారు. ఈ నెల 22వ తేదీ సోమవారం అయోధ్యలో జరిగే రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనేందుకు రజనీకాంత్ ఆదివారం చెన్నై నుంచి అయోధ్యకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... 'రామజన్మభూమికి వెళ్తుండటం ఎంతో సంతోషంగా ఉంది. 500 యేళ్లకుపైగా సాగిన సమస్య ఇది. సుప్రీంకోర్టు మంచి తీర్పు ఇచ్చింది. దీంతో అయోధ్యలో రామమందిర నిర్మాణం కార్యరూపం దాల్చింది. ఈ రోజు చరిత్రలో మరిచిపోలేని రోజు. ఎంతో సంతోషంగా, ఆనందంగా ఉంది' అన్నారు. కాగా, రామమందిర ప్రారంభోత్సవంలో పాల్గొనేందుకు హీరో ధనుష్ కూడా అయోధ్యకు బయలుదేరి వెళ్లారు. వీరిద్దరూ ఒకే విమానంలో వెళ్లినట్టు సమాచారం.

గణతంత్ర దినోత్సవం...

విమానాశ్రయంలో ఐదంచెల భద్రత

పెరంబూర్, జనవరి 21: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉగ్రవాద దాడులు అడ్డుకొనేలా చెన్నై విమానాశ్రయంలో ముందు జాగ్రత్త చర్యలుగా ఐదంచెల భద్రత ఏర్పాటైంది. దేశ ప్రజలు ఈ నెల 26వ తేది గణతంత్ర వేడుకలు జరుపుకొనేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, వేడుకలు భగ్నం చేసేలా ఉగ్రవాద దాడి జరుగవచ్చని కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు అందిన సమాచారంతో, దేశ వ్యాప్తంగా భద్రతా చర్యలు కట్టుదిట్టం చేశారు. ఆ చర్యల్లో భాగంగా, చెన్నై విమానాశ్రయంలో శుక్రవారం రాత్రి నుంచి ఐదంచెల భద్రత ఏర్పాటుచేశారు. అలాగే, విమానాశ్రయానికి వచ్చే వాహనాలను ప్రవేశద్వారాల వద్ద నిలిపి జాగిలాలతో క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే లోపలికి అనుమతిస్తున్నారు. అలాగే, విమానాశ్రయంలో జాగిలాలతో కూడిన కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాలు పర్యవేక్షిస్తున్నాయి. విమానాశ్రయంలో సందర్శకులకు నిషేధం విధించడంతో పాటు అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా గుర్తింపు కార్డు ధరించాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

విమానాలకు ఇంధనం నింపే ప్రాంతంలో అదనపు కెమెరాలు ఏర్పాటు చేసి, కంట్రోల్ రూమ్ నుంచి 24 గంటలు పర్యవేక్షిస్తున్నారు.

ప్రయాణికులకు సూచనలు

విమాన ప్రయాణికుల తనిఖీలను అధికం చేశారు. సాధారణ తనిఖీలతో పాటు, విమానంలో ఎక్కే సమయంలో మరోసారి తనిఖీలు చేపడుతున్నారు. అందువల్ల స్వదేశీ ప్రయాణికులు విమానం బయల్దేరే సమాయానికి గంటన్నర ముందుగా, విదేశీ ప్రయాణికులు మూడు గంటల ముందుగా రావాలని ప్రకటన వెలువడింది. ప్రయాణికులు ద్రవ వస్తువులు తీసుకెళ్లేందుకు నిషేధం విధించారు. పార్శిళ్లు కూడా పలుమార్లు తనిఖీల అనంతరం అనుమతిస్తున్నారు. ఈ నెల 30వ తేదీ అర్ధరాత్రి వరకు ఈ భద్రతా చర్యలు అమలులో ఉంటాయి. అలాగే, ఈ నెల 24 నుంచి 26వ తేది వరకు భద్రతను తీవ్రతరం చేసి ఏడంచెల భద్రత ఏర్పాటు చేయనున్నట్లు విమానాశ్రయ భద్రతా అధికారులు తెలిపారు.



నటి ఖుష్బూ అత్తగారి ఆశీస్సులు పొందిన మోదీ



ఆశీస్సులు పొందుతున్న ప్రధాని మోదీ

అడయార్, జనవరి 21: సినీ నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ అత్త దైవానై చిదంబరం పిళ్లై వద్ద ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులు తీసుకున్నారు. 92 యేళ్ల ఆమెను ఇటీవల చెన్నైలో ఖేలో ఇండియా క్రీడోత్సవాలను ప్రారంభించేందుకు నగరానికి వచ్చిన ప్రధాని మోదీ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. స్థానిక పెరియమేడ్‌లోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలోని వీవీఐపీ గదిలో ఆమెను మోదీ కలుసుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఖుష్బూ కూడా ఉన్నారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఖుష్బూ ఆదివారం సోషల్ మీడియాలో షేర్ చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. '92 యేళ్ల తన అత్త దైవానై చిదంబరం పిళ్ళై ప్రధాని మోదీ వీరాభిమాని. ఆయనను ఒక్కసారైన కలుసుకోవాలని తపనపడ్డారు. ఈ క్రమంలో ఈ నెల 19న నగరానికి వచ్చిన ప్రధాని మోదీని ఆమె కోరికను తీర్చి, ఆమె వద్ద ఆశీర్వాదం పొందారు. ఆ సమయంలో మా అత్త ఆనందాన్ని ఆమె కళ్లలో చూశా. ఈ వయసులో ఆమె సంతోషంగా ఉండటం మినహా నాకు మరొకటి లేదు. ప్రధాని మోదీకి రుణపడి ఉంటాను. మీకు కోటి వందనాలు' అంటూ ఖుష్బూ పేర్కొన్నారు.

నీలాంగరైలో 'లిక్కో కుసినా' షోరూం

చెన్నై, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇటాలియన్ డిజైన్ మాడ్యులర్ కిచెన్, వార్డ్‌రోబ్‌లను రూపొందించటంలో పేరుగడించిన లిక్కో కుసినా సంస్థ నీలాంగరై ఎంఏ వైద్యలింగం రోడ్డులో కొత్త షోరూంను సంస్థ బిజినెస్ హెడ్ త్రిశూల్ దేవాంగ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొత్తగా రెసిడెన్షియల్ ప్లాట్లలో, నివాస గృహాల్లో కాపురానికి వెళ్లేవారికి 'ఎల్', 'యూ' ఆకారాలతో మాడ్యులర్ కిచెన్లు, పడకగదులు, హాల్స్‌లో అందమైన మన్నికైన ఫర్నిచర్, కుర్చీలు, బీరువాలు, అల్మారాలు, అద్దాలున్న వార్డ్‌రోబ్‌ను వివిధ రకాల ఇటాలియన్ డిజైన్లలో తయారు చేసి ఆయా గదుల్లో అమర్చుతామని తెలిపారు. 3 పడకలు, 2 పడకలున్న పడక గదులకు, సింగిల్ బెడ్ రూంకు తగినట్లు తమ సంస్థ మాడ్యులర్ కిచెన్లు, వార్డ్‌రోబ్‌లను, అద్దాలతో కూడా బల్లలను సమకూర్చి ఆయా గదులను అందంగా తీర్చిదిద్దుతుందన్నారు.



షోరూంను ప్రారంభిస్తున్న త్రిశూల్ దేవాంగ తదితరులు



ఒప్పంద పత్రాన్ని ప్రదర్శిస్తున్న కాసాగ్రాండ్ సీఓఓ మన్‌దీప్‌సింగ్, అవర్‌షైన్ గోగ్లోబల్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ అజీజా జలాలుద్దీన్

కుమారిలో కాసాగ్రాండ్ కన్వెన్షన్ సెంటర్

చెన్నై, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పర్యాటక ప్రాంతం కన్నియాకుమారిని భారతదేశపు కేప్‌టౌన్‌గా తీర్చిదిద్దటానికి కాసాగ్రాండ్ కాంట్రాక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సింగపూరుకు చెందిన 'అవర్ షైన్ గోగ్లోబల్ లిమిటెడ్‌తో భాగస్వామ్యం ఏర్పరచుకుంది. చెన్నైలో ఏర్పాటైన ఓ కార్యక్రమంలో కాసాగ్రాండ్ సంస్థ సీఓఓ మన్‌దీప్‌సింగ్, అవర్ షైన్ గోగ్లోబల్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ అజీజా జలాలుద్దీన్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ భాగస్వామ్యంతో 'ప్రాజెక్ట్ మేన్' పేరుతో 40 ఎకరాల విస్తీర్ణంలో 300 మిలియన్ల అమెరికన్ డాలర్ల పెట్టుబడితో పర్యాటకులను ఆకట్టుకునే రీతిలో పర్యావరణ ప్రోత్సాహక కన్వెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ సెంటర్‌లో సదస్సుల నిర్వహణకు హాళ్లు, 100 దుకాణాలు, థియేటర్, మాల్స్ కూడా ఉంటాయని తెలిపారు.



'మధుర స్మృతులు' కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ కలయిక

చెన్నై, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాదిరివేడు, మాదరపాక్కంలోని ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు 'మధుర స్మృతులు' పేరుతో కలుసుకున్నారు. ఈ పాఠశాలలో 1974-75 సంవత్సరాల్లో 11వ తరగతి (ఎస్ఎస్ఎల్‌సీ) చదివిన విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకొని తమ పాత మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో తొలుత మహిళా విద్యార్థినులచే జ్యోతి ప్రజ్వలన నిర్వహించగా, కెబీ వీరాస్వామి ప్రార్థనా గీతం ఆలపించారు. అలనాటి పాఠశాల జ్ఞాపకాలు, ప్రస్తుతం తమ జీవన విధానాన్ని సహచరులతో పంచుకున్నారు. కార్యక్రమంలో మన్ని, మునుస్వామి, తుకారామ్ లలిత గీతాలు ఆలపించగా, దేవి. మాధవయ్య 'హరిశ్చంద్ర' నాటకంలోని కాటి సన్నివేశాన్ని ఏకపాత్రాభినయంతో అలరించారు. అనంతరం మధ్యాహ్న భోజనం తర్వాత సెల్ఫీలు తీసుకుంటూ ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో తొలుత మృతిచెందిన తమ సహచర విద్యార్థులకు నివాళి అర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

28న డీఎంకేతో చర్చలు

● కాంగ్రెస్ ఇన్‌ఛార్జి అజోయ్‌కుమార్

పెరంబూర్, జనవరి 21: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కూటమిలో సీట్ల సర్దుబాటుపై ఈనెల 28వ తేదీన డీఎంకేతో చర్చలు జరుపనున్నట్లు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌ఛార్జి అజోయ్‌కుమార్ తెలిపారు. అజోయ్‌కుమార్ రెండు రోజులుగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులతో పార్లమెంటు ఎన్నికలపై చర్చిస్తున్నారు. ఈక్రమంలో జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో ఆయన వేర్వేరుగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో బలంగా ఉన్న స్థానాలు, కూటమిలో కోరాల్సిన సీట్లు తదితరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో డీఎంకే కూటమి బలంగా ఉందని, గత పార్లమెంటు ఎన్నికల ఫలితాలే రాబోయే ఎన్నికల్లోనూ పునరావృత్తమవుతాయన్నారు. కాగా, ఇప్పటికే రెండు పార్టీలు సీట్ల సర్దుబాటుకు సంబంధించిన చర్చలకు కమిటీలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

రాడిసన్ బ్లూలో 'ఆంగ్లో ఇండియన్ మాస్టర్‌క్లాస్'



అడయార్, జనవరి 21: నగరంలోని ప్రముఖ స్టార్ హోటళ్లలో ఒకటైన రాడిసన్ బ్లూలో ఈనెల 18, 19 తేదీల్లో రెండు రోజుల పాటు 'ఆంగ్లో ఇండియన్ మాస్టర్‌క్లాస్' ఫ్యూజన్ వంటకాల ఫెస్టివల్ జరిగింది. 'మాస్టర్ క్లాస్ మినిస్ట్రీ ఆఫ్ చట్నీస్' పేరుతో నిర్వహించిన ఈ ఫెస్టివల్‌లో ఆంగ్లో ఇండియన్ వంటకాలను ప్రధానంగా ఉంచారు. ఓల్డ్ కంటోన్మెంట్ తరహాలో రెస్టారెంట్‌ను డిజైన్ చేసి, అతిథులకు విలక్షణమైన బెస్పోక్ అనుభవాన్ని అందించే ప్రయత్నం చేశారు. చెఫ్ బ్రిడ్జేట్ వైట్ కుమార్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ ఫెస్టివల్ జరిగింది. ఇందులో హోస్ట్ అమీతా అగ్నిహోత్రి, జీఆర్టీ హోటల్స్ ఈసీవో విక్రమ్ కోటా తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో రిపబ్లిక్ డే సాహస ప్రదర్శనకు రాష్ట్ర మహిళా కమాండోల ఎంపిక



సీఆర్‌పీఎఫ్ మహిళా కమాండోలు విజిత, ఝాన్సి, కలైవాణి

పెరంబూర్, జనవరి 21: కేంద్ర రిజర్వు ప్రొటెక్షన్ ఫోర్స్ మహిళా కమాండో విభాగం కన్నియాకుమారి నుంచి గుజరాత్ వరకు 'మహిళలు, చిన్నారులను రక్షిద్దాం..చదివిద్దాం' అంటూ మోటర్ సైకిళ్లపై అవగాహన ర్యాలీ చేపట్టారు. గత ఏడాది అక్టోబరు 5వ తేది కన్నియాకుమారిలో ప్రారంభమైన ఈ ర్యాలీ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి రోజైన అక్టోబరు 31వ తేది గుజరాత్ రాష్ట్రానికి చేరుకుంది. ర్యాలీలో పాల్గొన్న మహిళా కమాండోలు గుజరాత్ రాష్ట్రంలో పలురకాల సాహస విన్యాసాలు ప్రదర్శించారు. వారిలో రాష్ట్రానికి చెందిన 8 మంది మహిళా సిబ్బంది కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో, ఈ నెల 26వ తేది ఢిల్లీలో జరగనున్న రిపబ్లిక్ పెరేడ్‌లో పాల్గొనే అవకాశం ఈ బృందానికి లభించింది. ఎంపికైన 9 మందిలో తూత్తుకుడి జిల్లా ముడివైత్తానేందల్‌కు చెందిన లక్ష్మణన్ భార్య ఝాన్సీ మనోహరన్ ఒకరు. ఈ విషయమై ఝాన్సీ మాట్లాడుతూ... 'దక్షిణ మండల సీఆర్‌పీఎఫ్ కమాండో దళంలో పనిచేస్తున్నా. మహిళా కమాండోలు మోటరు సైకిళ్లపై చేసిన సాహసకృత్యాల కారణంగా, రిపబ్లిక్ డే వేడుకల్లో అవకాశం కలిగింది. మా బృందంలో మొత్తం 90 మంది ఉండగా, నాతోపాటు 9 మంది రాష్ట్రానికి చెందిన మహిళలున్నారు. కన్నియాకుమారి జిల్లాకు చెందిన విజిలా, కలైవాణి సహా 9 మంది ఉన్నారని, రిపబ్లిక్ పెరేడ్‌లో తమ బృందం మోటర్ సైకిళ్లపై సాహసకృత్యాలు చేయనున్నాం' అంటూ తెలిపారు.

చెన్నై టీటీడీ ఆలయంలో తిరుముల్లైవాయిల్ మధురగానాలయ ఆధ్వర్యంలో కమలారామనాథన్ బృందం నాయకత్వంలో భద్రాచల రామదాసు చరిత్ర ప్రదర్శన నిర్వహించిన చిన్నారులతో ఆలయ నిర్వాహకులు



వైభవంగా మదురై పెరుమాళ్ ఆలయ కుంభాభిషేకం

ప్యారీస్, జనవరి 21: మదురై నగరంలో పురాతన పెరుమాళ్ ఆలయ కుంభాభిషేకం ఆదివారం ఉదయం వైభవంగా సాగింది. వేలాదిమంది భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మదురై పెరియార్ బస్‌స్టేషన్ సమీపంలో ఉన్న ఈ ఆలయం 108 దివ్యదేశాల్లో 47వదిగా గుర్తింపు పొందింది. ఈ ఆలయంలో 2006వ సంవత్సరం మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఈ వైభవానికి 12 ఏళ్లు పూర్తికావడంతో రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ ఉత్తర్వుల మేరకు రెండేళ్ల క్రితం జీర్ణోద్ధరణ పనులు చేపట్టి పూర్తిచేశారు. కుంభాభిషేకం సందర్భంగా ఈనెల 17వ తేది ఉదయం 10.15 గంటలకు వాస్తు శాంతి, యాగశాల పూజలు ప్రారంభించారు. సాయంత్రం నుంచి నాలుగు జాముల పూజలను ఆలయ రుత్వికులు చేపట్టారు. ఆదివారం ఉదయం 7 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజ పెరుమాళ్ స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి యాగశాల నుంచి ప్రధాన మండపానికి వేంచేపు చేశారు. అనంతరం 8.45 గంటలకు ఆలయ ప్రాంగణంలో ఉన్న అన్ని సన్నిధులపై పవిత్రజలాలు ప్రోక్షించి మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణలు, గోవింద నామస్మరణల మధ్య కుంభాభిషేకం నిర్వహించారు.

పన్నుల వాటా కేటాయింపులో కేంద్రం పక్షపాతం

పెరంబూర్, జనవరి 21: రాష్ట్రాలకు పన్నుల వాటా కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం పక్షపాత వైఖరి అవలంబిస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి తంగం తెన్నరసు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం నుంచి రూ.6.5 లక్షల కోట్ల పన్నుల రూపంలో వెళ్తుండగా, కేవలం రూ.2.5 లక్షల కోట్లను మాత్రమే వాటాగా రాష్ట్రప్రభుత్వానికి తిరిగి అందజేస్తోందన్నారు. అదే సమయంలో రూ.2.70 కోట్లు పన్నుల రూపంలో అందిస్తున్న ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి మాత్రం కేంద్ర ప్రభుత్వం పన్నుల వాటాగా రూ.11 లక్షల కోట్లు అందిస్తోందన్నారు. ఆ ప్రకారం, బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలకు పన్నుల కేటాయింపులో కేంద్రం పక్షపాత వైఖరి అవలంబిస్తోందని మంత్రి వాపోయారు.

జాక్టో-జియో సమస్యలు పరిష్కరించండి

● పీఎంకే నేత డా.రాందాస్

పెరంబూర్, జనవరి 21: పాత పింఛన్ విధానం సహా 10 డిమాండ్ల పరిష్కారం కోరుతున్న జాక్టో-జియో ప్రతినిధులతో ప్రభుత్వం చర్చలు జరపాలని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ కోరారు. ఫిబ్రవరి 15వ తేది సమ్మె చేపట్టనున్నట్లు, అప్పటికీ ప్రభుత్వం స్పందించని పక్షంలో 26వ తేది నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు ప్రకటించాయని గుర్తుచేశారు. ఈ సంఘంలో ఉపాధ్యాయులు కూడా ఉండడంతో పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడతారన్నారు.

ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

● పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి

డీఎంకే మహానాడు కానీ, అయోధ్య రామాలయం కుంభాభిషేకం వేడుకలు కానీ ప్రజలకు ఇబ్బందులు కలిగించేవిగా ఉండరాదని పీఎంకే అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ అన్బుమణి రాందాస్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ధర్మపురిలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... రామాలయం కుంభాభిషేకం వేడుకల్లో పాల్గొనాలని తనకు ఆహ్వానం అందిందన్నారు. కానీ, పని ఒత్తిడి, రద్దీని దృష్టిలో ఉంచుకొని తాను వేడుకలకు వెళ్లడం లేదన్నారు. అలాగే, సేలంలో డీఎంకే యువజన మహానాడు జరపడం ఆ పార్టీ అంతర్గత వ్యవహారమన్నారు. కులగణనకు ఆయా పార్టీలు గుర్తెరగాలని, రాష్ట్రప్రభుత్వం సత్వరం గణన చేపట్టాలని అన్బుమణి కోరారు.

ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించండి

● నేడు అయోధ్యలో రామాలయం ప్రారంభం

— గవర్నర్ ఆర్ఎన్ రవి

పెరంబూర్, జనవరి 21: అయోధ్యలో బాలరాముడు ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా రాష్ట్రప్రజలు తమ నివాసాల్లో దీపాలు వెలిగించాలని రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి పిలుపునిచ్చారు. ఈ మేరకు రాజ్‌భవన్ 'ఎక్స్' పేజీలో ట్వీట్ చేశారు. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపనతో దేశం అద్భుతమైన రామ మందిరాన్ని పొందనుంది. ప్రస్తుతం దేశం మొత్తం రామ భక్తిలో మునిగిపోయింది. 'శ్రీరాముడు' భారత దేశ జాతీయ చిహ్నంగా మారారు. రాష్ట్రప్రజల్లో కూడా రామభక్తిని నేను స్వయంగా గమనించి పులకించిపోయాను.